


తిరుమల శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం వీఐపి ప్రారంభ విరామ దర్శనసమయంలో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, హిందీ ఇంప్లిమెంటేషన్ పార్లమెంట్ కమిటీ సభ్యులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. టిటిడి ఆలయ అధికారులు వారికి సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

సచివాలయాల్లో ఛార్జీల మోత..

ప్రజాశక్తి- తిరుపతిటౌన్ :

సచివాలయాల ఏర్పాటుతో అన్నిరకాల సేవలను నామమాత్రపు రుసుముతో అందిస్తామని ప్రభుత్వం తొలిరోజుల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. అయితే ఆరంభంలో అత్యధిక సచివాలయాలకు సరైన వసతి, ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడంతో మూడునెలలు వరకు పూర్తిస్థాయిలో సేవలు మొదలు కాలేదు. సచివాలయలల్లో 550 రకాల పౌరసేవలను అందించాలని 2020 జనవరిలో ఉత్తర్వులు జారీచేసింది. శాఖలవారీగా సేవలు, దరఖాస్తు చేసిన తరువాత ఎన్నిరోజుల్లో ధ్రువపత్రం అందుతుందో తెలియజేస్తు సచివాలయాల్లో సిటిజన్ ఛార్జీలను అందజేసింది. వీటిలో మొత్తం 16శాఖల ఉద్యోగులు పనిచేస్తుంటారు.



తొలుత ఈసేవలను, ఎ,బి కేటగిరిలుగా విభజించి ఒక్కో సేవకు రూ.15లు మాత్రమే వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే సర్వర్లు తరుచు మొరాయిస్తుండడంతో ఇంటర్నెట్ స్పీడ్ చాలకపోవడంతో చాలా సచివాయాల్లో సేవలు అందని పనిస్థితి నెలకొంది. ఈవిషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో సర్వర్ల సామర్థ్యం పెంచింది. సర్వర్ల సామర్థ్యంతో పాటు సర్వీసు ఛార్జీలను కూడా ప్రభుత్వ పెంచేసింది. 2021 జనవరి నుంచి ఎ-కేటగిరి సేవల రుసుమును రూ.35లకు, బి కేటగిరి సేవల రుసుమును రూ.45లకు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. అయినప్పటికి ప్రింటర్ల ఖర్చు, సచివాలయాల్లో నిర్వహణ వ్యయం పెరిగిపోయిందంటూ మళ్లీ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రతిసేవకు రూ.5ల చొప్పున పెంచింది.

బి-కేటగిరి సేవల్లో భూములకు సంబంధించి ఈసీలు, ఇతరత్రా పత్రాలు, ఆధార్, నకళ్లువంటి సేవలకు రూ.50లు వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ నెట్‌సెంటర్లో కొన్నిరకాల బిల్లులు కట్టించుకుంటుండగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాయాల్లో సేవా పన్ను వసూలు చేస్తున్నారు.

అదనంగా సేవా రుసుము వసూలు..

ఏపిఈపీడిసిఎల్ జారీచేసిన బిల్లులో అంతే మొత్తాన్ని యూపిఐ యాప్ ద్వారా చెల్లించే వెసులుబాటు ఉంది. కొన్ని సచివాయాల్లో విద్యుత్ బిల్లు రూ.200లు లోపు అయితే రూ.2లు అంతకు మించి రూ.1000లు లోపు రూ.5, రూ.1001నుంచి రూ.2500లులోపు అయితే రూ.10వసూలు చేస్తున్నారు. రూ 2,500 దాటిన బిల్లు వస్తే సేవారుసుము కింద రూ.25లు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో విద్యుత్‌బిల్లులు చెల్లించేందుకు సచివాలయాలోకి వెళ్లేందుకు వినియోగదారులు ఆసక్తి చూపించడం లేదు. సిటిజన్ ఛార్జీలో పేర్కొన్నప్పటికి రూ.25ల కన్నా తక్కువ సేవలను మాత్రమే ప్రజలు వినియోగించుకుంటున్నారు. ప్రైవేట్ నెట్‌సెంటర్‌తోపాటు గతంలో ఉన్న మీసేవ కేంద్రాలతో సమానంగా సచివాయాల్లో సేవలకు సేవాపన్ను వసూలు చేయాల్సి రావడంతో లావాదేవీలు చాలా తక్కువ జరుగుతున్నాయి. ప్రభుత్వం ప్రజలకు మేలు చేసేందుకు తీసుకువచ్చిన వ్యవస్థలోని లోపాలను సరిచేసి మెరుగైన సేవాలందించాల్సిన అవసరం ఉంది.

ఓటర్ల నమోదుకు నేడే ఆఖరు

- **మరింత మంది ఓటర్లు చేరే అవకాశం**
- **గడువు పెంపునకు అవకాశం**

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి:

ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియ నేటితో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆఖరి రోజు భారీ ఎత్తున ఓట్లు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా రెండు, మూడు రోజులుగా భారీగా వస్తున్న దరఖాస్తుల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ గడువును మరికొన్ని రోజులు పెంచేందుకు అవకాశముందని చర్చ సాగుతోంది.



ఓటు నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

తూర్పు రాయలసీమ ప్రాంత పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజక వర్గానికి సంబంధించి అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతున్న విషయం విధితమే. తొలి 15రోజులు తక్కువగా ఓటర్లు నమోదు అవుతున్నా.. క్రమంగా పెరుగుతూ వస్తున్నారు. అధికారుల్లో ఉన్న సందేశాలు నివృత్తి కావడం, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓలు సమీక్షలు నిర్వహించడం వంటి కార్యక్రమాల వల్ల ఈ నియోజకవర్గం వ్యాప్తంగా నమోదు వేగంగా పెరుగుతోంది. 2.66లక్షల మందికిపైగా ఓట్లు నమోదు చేసుకున్నారు.

రికార్డు స్థాయిలో..

ఈ మూడు ఉమ్మడి జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది పట్టభద్రులు, 12వేల మంది దాకా ఉపాధ్యాయులు ఉంటారు అనేది అంచనా. అయితే 20వ తేదీ వరకు ఆయా ప్రాంతాల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటర్ల నమోదు కార్యక్రమం నత్తనడకన సాగింది. 20రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఊపందుకోలేదు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఫాం 18ను ఆన్‌లైన్‌లో 55,262 మంది. నేరుగా 9767 మంది నమోదు చేసుకున్నారు. ఇలా మొత్తంగా 67,598 మంది మాత్రం చేసుకున్నారు. ఇక ఉపాధ్యాయుల్లో ఆయా జిల్లాల్లో మొత్తం 1187 మంది నమోదయ్యారు. అయితే వారం రోజుల నుంచి నమోదు ప్రక్రియ పూర్తిగా మారిపోయింది. శనివారం రాత్రి వరకు అందిన వివరాల ప్రకారం ఆరు జిల్లాల పరిధిలో పట్టభద్రులు 198695 మంది ఆన్‌లైన్‌లో, 67312 మంది నేరుగా మొత్తం 2,66,007 మంది ఓట్లు నమోదు చేసుకున్నారు. ఆదివారం నాడు ఈ సంఖ్య మరింత పెరిగి ఉంటుందనేది అంచనా. మొత్తంగా 2.80 లక్షల మంది నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 71వేల మంది తమ ఓటును నమోదు చేసుకున్నారు. ఇక ఉపాధ్యాయుల్లో 12,815 మంది శనివారం రాత్రి వరకు నమోదు చేసుకున్నారు. వీరి సంఖ్య కూడా 14వేల వరకు పెరగొచ్చని అధికారులు చెబుతున్నారు.

ఓటు నమోదుకు అవకాశం

ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు నమోదు చేసుకునేందుకు మళ్లీ అవకాశం వస్తుందని తెలుస్తోంది. వచ్చిన ఓట్లపైన ఫిర్యాదులు తీసుకుంటారు. దీనికి కొంత సమయం ఇస్తుంటారు. ఈ సమయంలో కొత్త ఓట్లు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

నూతన భవనంలో డయల్ యువర్ కమిషనర్

కమిషనర్ అనుపమ అంజలి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ తాత్కాలిక నూతన కార్యాలయం స్విమ్స్ రోడ్డు, ఇరిగేషన్ కార్యాలయం ఎదురుగా వున్న భవనంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ అనుపమ అంజలి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 7వ తేదీ ఉదయం 10 నుంచి 11వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని, 11 నుంచి 12 గంటల వరకు నేరుగా అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణలు పాల్గొంటారని తెలియజేశారు. 0877-2227208 నంబర్‌కి కాల్ చేసి తమ పిర్యాధులు, నేరుగా వచ్చి అర్జీలు, ఫిర్యాదులు ఇవ్వవచ్చునని కమిషనర్ తెలిపారు.

సిఎం స్ఫూర్తితో ముందుకు వెళ్తున్నాం

మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్ : పీఎల్‌ఆర్ జాబ్‌సెంటర్ ద్వారా ఉద్యోగాలు పొందిన 109 మందికి నియామక పత్రాలు ఆదివారం రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసి చైర్మన్ ఏ.మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్సీ కెఆర్‌జె.భరత్, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్, టిటిడి పాలకమండలి సభ్యులు పోకల అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ పిఎల్‌ఆర్ జాబ్‌మేళా ద్వారా అనేక మందికి ఉద్యోగావకాశాలు చూపిస్తున్నారని, మన వంతు బాధ్యతగా తీసుకుని ఈ నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని భావించామన్నారు. వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని ఈ చర్యలు తీసుకున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల పేదకుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా పుంజుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో జాబ్ మేళాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జాబ్ మేళాల ద్వారా మూడు జిల్లాల పరిధిలో 11897 మందికి ఉద్యోగాలు కల్పించగా ఒక్క పుంగనూరు నియోజకవర్గంలో మొత్తం 6127 మందికి ఉద్యోగాలు, ఆర్మీకు 161 మంది ఎంపిక అయ్యారని తెలిపారు. సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విధానాలే స్ఫూర్తిగా ఈ జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి సిఎం బాటలో నడుస్తున్నామన్నారు.

8న చంద్రగ్రహణం కారణంగా 11 గంటల పాటు

శ్రీవారి ఆలయ తలుపులు మూత

- బ్రేక్ దర్శనాలు రద్దు - 7న సిఫార్సు లేఖలు స్వీకరించబడవు

ప్రజాశక్తి- తిరుమల: చంద్రగ్రహణం కారణంగా ఈనెల 8న మంగళవారం ఉదయం 8.30 నుంచి రాత్రి దాదాపు 7.30గంటల వరకు 11 గంటల పాటు శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంచుతారు. ఈ కారణంగా బ్రేక్ దర్శనం రద్దు చేసినందున ఈనెల 7న సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. మంగళవారం మధ్యాహ్నం 2.39 గంటల నుండి సాయంత్రం 6.27 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుంది. చంద్రగ్రహణం కారణంగా శ్రీవాణి, రూ.300లు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను టిటిడి రద్దు చేసింది. రాత్రి 7.30 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి చేసిన అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి టిటిడికి సహకరించాలని కోరడమైనది.

భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉండాలి

మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చాన్‌బాషా

ప్రజాశక్తి-నాయుడుపేట: భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉండాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చాన్‌బాషా అన్నారు. ఆదివారం నాయుడుపేటలోని సీఐటీయూ కార్యాలయంలో తిరుపతి జిల్లా బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ మొదటి మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు తప్పనిసరిగా సంక్షేమ కార్డులు విధిగా తీసుకోవాలని, ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సీఐటీయూ జిల్లా నాయకులు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇసుక కొరత సృష్టించడంతో కొన్నాళ్లు కార్మికులకు పనిలేకుండా చేశారని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి నుంచి కార్మికులకు ఎలాంటి సహాయం అందలేదన్నారు. గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ భవన నిర్మాణకార్మికులకు అందించే సంక్షేమ పథకాలకు పలు కారణాలను చూపుతూ అనర్హులుగా చూపుతున్నారని వాపోయారు. అనంతరం 25మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులు అల్లయ్య, కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా శ్రీరాములను ఎంపిక చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మునిరాజ, మండల సీఐటీయూ కార్యదర్శి ముకుంద, అధ్యక్షులు మహేష్, భవన నిర్మాణ కార్మికులు సుబ్రహ్మణ్యం, అజయ్, సురేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకులు బాలసుబ్రహ్మణ్యం

ఆలయ లీకేజీల పరిశీలన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం పైభాగంలో ఏర్పడుతున్న లీకేజీలను ఐఐటి నిపుణులు ఆదివారం పరిశీలించారు. తిరుపతి ఐఐటి ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో విచ్చేసిన సాంకేతిక బృందం ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు, ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి తొలత లీకేజీ నివారణకు టెస్టింగ్ ప్రక్రియ చేపట్టారు. గతంలో ఆలయ పైభాగాన మూడు దఫాలుగా కాంక్రీట్ వేసి ఉండడంతో మూడు చోట్ల డ్రిల్లింగ్ చేసి నమూనాలు సేకరించారు. పాత సున్నపు కట్టడంపై పెంకు నిర్మాణం, దానిపైన సన్నటి మెస్ పై చిప్స్ కాంక్రీట్ వేసి ఉండటాన్ని గుర్తించారు. దానిపై మరోసారి కాంక్రీట్ వేసి ఉన్నట్లు తెలిపారు. మూడు లేయర్లుగా వేసియున్న కాంక్రీట్‌ను పరిశీలించారు. మూడు చోట్ల తీసిన శాంపిల్ టెస్టింగ్ రంధ్రాల వద్ద తాము ఆధునిక పద్ధతి లో పురాతన కట్టడాల నిర్మాణంలో వినియోగించే పదార్థాల మిశ్రమంతో తయారుచేసిన రసాయనాన్ని ఆ రంధ్రాల్లో వేశారు. పది రోజులు పాటు వేచి చూడాలనీ, రసాయనం ఎంతవరకు వ్యాపించి ఏ మేరకు లీకేజీనీ అరికడుతుందో అంచనా వేయనున్నామని అన్నారు. ఐఐటి నిపుణులు పురాతన కట్టడం నిర్మాణాల్లో వినియోగించే గవ్వ సున్నం, తాటి బెల్లం, కరక్కాయ, జాజికాయ, మెత్తటి ఇసుకతో తయారుచేసిన రసాయనాన్ని వినియోగించారు. ఈ రసాయనం పాత కట్టడంలో ఏర్పడిన లీకేజీల్లోకి చొచ్చుకుని వెళ్లి కట్టడాన్ని పటిష్టతం చేస్తుందని ఐఐటి నిపుణులు తెలిపారు. తొలుత టెస్టింగ్ ప్రక్రియలో మూడు శాంపిల్స్ వద్ద పరీక్ష చేశారు. పది రోజుల తర్వాత ఇది ఎంతవరకు వ్యాపించి లీకేజీ నివారణ కు దోహదపడుతుందో గుర్తిస్తారు. తదుపరి ఆలయ పైభాగాన వేచి ఉన్న మూడు లేయర్ల కాంక్రీట్లను పూర్తిగా తొలగించి పాత సున్నపు స్లాబుపై మిశ్రమ రసాయనం పూత వేసున్నారు. అయితే రసాయన పూత వేయాలంటే మంచి ఎండలు ఉండాలని నిపుణులు సూచించారు. అనంతరం అంజూరు తారకశ్రీనివాసులు మాట్లాడుతూ పురాతన ఆలయమైన శ్రీకాళహస్తి ఆలయంలో లీకేజీ సమస్యాత్మకంగా మారిందనీ, గతంలో చేసిన పనుల మూలంగా లీకేజీ నివారణ కాకపోగా మరింత ఆందోళనకరంగా మారిందన్నారు. తాజాగా ఐఐటి నిపుణుల సహకారంతో ఆధునిక పురాతన పద్ధతులను మేళవించి పూర్తిస్థాయిలో లీకేజీ అరికట్టే ప్రయత్నం చేస్తున్నామన్నారు.



లీకేజీలను ఐఐటి నిపుణులతో పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు

జానపద కళారూపాలను పునరుద్ధరించాలి

జెవికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు జగన్‌మోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న వందవాసి నాగరాజు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: కనుమరుగవుతున్న జానపద కళారూపాలను పునరుద్ధరించాలని జానపద వత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జగన్మోహన్‌రావు, బంగారు మురళీ అన్నారు. ఆదివారం కళాకారుల సంఘం ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కోలాటాలు, చెక్కభజనలు చేపట్టారు. అనంతరం ర్యాలీగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జానపద వత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులతోపాటు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడారు. రాష్ట్రంలో కనుమరుగైపోతున్న కళలను గ్రామీణ ప్రాంతాల్లో పునరుద్ధరించాలని డిమాండు చేశారు. టీటీడీ అనుబంధ కార్యక్రమాల్లో కళాబందాలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జానపద వత్తి కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు గంగులమ్మ , ముకుంద, కేఆర్ సుబ్రహ్మణ్యం పిళ్లై, యాసిన్, బాషా, శివ, విజయ్, వెంకటమ్మ, నారాయణమ్మ, దేశమ్మ, సజన, ప్రకాష్, హేమాద్రి, దేవానందం తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరులో జానపద కళాకారుల ర్యాలీ

తిరుపతిలో స్టోర్‌ను ప్రారంభించిన 'అసుస్'

దేశవ్యాప్తంగా వాణిజ్య బలోపేతం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

దేశవ్యాప్తంగా బ్రాండ్ వాణిజ్యం మరింతగా విస్తరించడంలో భాగంగా తైవనీస్ సాంకేతిక సంస్థ అసుస్ ఇండియా నేడు తమ ప్రత్యేకమైన బ్రాండ్ స్టోర్‌ను తిరుపతిలో ప్రారంభించారు. ఈస్టోర్‌లో కంపెనీ ఎలక్ట్రానిక్స్ మరియు కంప్యూటర్ హార్డ్‌వేర్ అందుబాటులో ఉంటుంది. వీటిలో అసుస్ ప్రతిష్టాత్మకమైన ఉత్పత్తులు అయినటువంటి వివోబుక్, జెన్‌బుక్, జెన్‌బుక్-ఫ్లిప్, డెస్క్‌టాప్‌లు, రిపబ్లిక్ ఆఫ్ గేమర్స్ (ఆర్‌ఓజీ) ల్యాప్‌టాప్స్ ప్రదర్శించనున్నారు. తిరుపతి నగర నడిబొడ్డున ఉన్న ఈ నూతన ఎక్స్‌క్లూజివ్ ప్రీమియం స్టోర్ 235 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఈసందర్భంగా అర్నాల్డ్ సూ, బిజినెస్ హెడ్, కన్స్యూమర్ అండ్ గేమింగ్ పీసీ, సిస్టమ్ బిజినెస్ గ్రూప్, అసుస్ ఇండియా మాట్లాడుతూ భారతదేశంలో తమ వాణిజ్య కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని చాలా సంతోషంగా ఉన్నామన్నారు. అతి ముఖ్యమైనగా ఆంధ్రప్రదేశ్ ఒకటిని ఈ నూతన బ్రాండ్ స్టోర్‌ను తిరుపతిలో ప్రారంభించడమన్నది దేశ వ్యాప్తంగా విభిన్న ప్రాంతాలలో మా తాజా ఆవిష్కరణలతో వినూత్న అనుభవాలను అందించడం ద్వారా వినియోగదారులకు తగిన శక్తిని అందించాలనే మా ప్రయత్నాలలో కీలకమైన ముందడుగుగా నిలుస్తుందన్నారు. వినియోగదారులను మరింతగా ఆకట్టుకునే విధంగా టచ్‌పాయింట్లను సైతం ఏర్పాటు చేశామని అన్నారు. తిరుపతిలో మొట్టమొదటి రిటైల్ స్టోర్‌లో తాజా గేమింగ్, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులు అయినటువంటి పీసీలు, డెస్క్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, విస్తతశ్రేణి యాక్ససరీలు అందిచనున్నామన్నారు. ఈ వాణిజ్యస్టోర్ ను ఎస్‌వీ కంప్యూటర్స్ ఎన్ గాడ్జెట్స్, ఆరోగ్య ఫార్మసీ మరియు వీఐపీ రెసిడెన్సీ హోటల్ ఎదురుగా, కొర్లగుంట జంక్షన్, తిరుమల బైపాస్ రోడ్, తిరుపతి-517501 ఏర్పాటు చేశామని తెలిపారు.



ట్రెక్కింగ్ అందరికీ అవసరం


మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్:

ఉరుకులు పరుగులతో సాగుతున్న యాంత్రికజీవితంలో ట్రెక్కింగ్ ప్రతిఒక్కరికి అవసరం అని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజ వ్యవస్థపకులు గల్లా రామచంద్ర నాయుడు తెలిపారు. ఆదివారం పూతలపట్టు మండలం పేటమిట్ట గుట్టల్లో అమరరాజ గ్రూప్ అభివద్ధి చేసిన సామాజిక అటవీ ప్రాంతంలో తిరుపతి ట్రెక్కర్స్ శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ అధ్వర్యంలో ట్రెక్కింగ్ నిర్వహించారు. వారికి గల్లా దంపతులు ఆతిథ్యం ఇచ్చారు. ఈసదర్భంగా వారి స్వగహంలో తిరుపతి నుంచి వచ్చిన ట్రెక్కర్స్‌తో మాట్లాడుతూ నిత్యజీవితంలో ట్రెక్కింగ్ వారానికి ఒకరోజు నిర్వహించటం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రస్తుతం మన దేశం, రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల్లో ఇలాంటి మంచి విషయాలు అలవాటుగా చేసుకుని ప్రతిఒక్కరు పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం పెటమిట్టలో అమరరాజ గ్రూప్ నిర్వహిస్తున్న స్కిల్‌డెవల్మెంట్ సెంటర్‌ను ట్రేక్కర్స్ సందర్శంచి నిరుద్యోగ యువతకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు పరిశీలించారు.



ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సిఐటియు



మహాసభలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: స్థానిక యశోదనగర్‌లోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు అనుబంధ ఆటో కార్మికుల సంఘం నగర 7వ మహాసభ ఆదివారం జరిగింది. ఈ సభకు సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మి అధ్యక్షతన జరిగింది. నగరంలోని ఆటోకార్మికుల సమస్యలు పరిష్కరించాలి డిమాండ్ చేశారు. సిఐటియు నగర అధ్యక్ష,కార్యదర్శులు టి.సుబ్రమణ్యం, లక్ష్మి మాట్లాడుతూ తిరుపతిలో దాదాపు 20వేల మందికి పైగా ఆటో కార్మికులు ఆటో నడిపి వారి కుటుంబాన్ని పోషించుకుంటున్నారని అన్నారు. పూర్తిగా ఆటోనే జీవనాధారంగా బతుకుతున్నటువంటి కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ అందేవిధంగా వాహనమిత్ర ప్రతి కార్మికుడికి అందేవిధంగా కషి చేయాలన్నారు. అలాగే ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాల నుంచి కార్మికులను రక్షించాలని, ప్రభుత్వం సబ్సిడీతో ఉన్నటువంటి రుణాలు ఆటోకార్మికులకు మంజూరు చేయాలని కోరారు. మహాసభల అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా నాంపల్లి చైతన్య, ప్రధానకార్యదర్శిగా తంజావూరు మురళి, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె.బాదుల్లా, సహాయ కార్యదర్శిగా సురేష్, మొత్తం 11మందిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు కే.వేణు, ఆటో యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు హరి, కార్మికులు పాల్గొన్నారు.

రేడియంట్ హాస్పిటల్ ప్రారంభం



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన రేడియంట్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రి వద్ద ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ దారారెడ్డి వరప్రసాద్‌బాబు అనుభవం కలవాడని తెలిపారు. రోగులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ కార్పొరేట్ వైద్యం సైతం సామాన్యులకు తక్కువ ధరకే అందించడం అభినందనీయమన్నారు. రోగులు దీని సద్దినం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, ఎంపీ డాక్టర్ గురుమూర్తి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డు విక్రయశాలలో భక్తుడి మృతి

ప్రజాశక్తి- తిరుమల : తిరుమలలో ఓ భక్తుడు గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం శ్రీవారి దర్శనానంతరం లడ్డూ విక్రయశాలకు వచ్చిన భక్తుడు 24వ కౌంటరు వద్ద అస్వస్థకు గురై కుప్పకూలాడు. దీంతో హుటాహుటిన టిటిడి భద్రత సిబ్బంది భక్తుడిని అశ్విని ఆస్పత్రికి తరలించిన ఫలితం లేకపోయింది. అతని వద్ద చిరునామా ఇతర వివరాలు లభించలేదు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

జీఈఎస్ ఆధ్వర్యంలో కలంకారీపై శిక్షణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, డీసీ హ్యాండీక్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో కలంకారీ పెయింటింగ్‌పై రెండు రోజులపాటు శిక్షణ, అవగాహన కల్పించనున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలంకారీ పెయింటింగ్‌పై నైపుణ్యం ఉన్న కళాకారుల కోసం ఈ నెల 8, 9వ తేదీల్లో 'క్రాఫ్ట్ డెమోన్‌స్ట్రేషన్ ప్రోగ్రాం'ను నిర్వహిస్తున్నామని, జాతీయ అవార్డు ఎం. విశ్వనాథ రెడ్డి కళాకారులకు వృత్తి నైపుణ్యంపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. పట్టణంలోని జయరామారావు వీధిలో ఉన్న గాయత్రి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని శ్రీకాళహస్తి ప్రాంత కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భుక్యా రవీంద్ర నాయక్‌కు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం హిందీ విభాగపు పరిశోధక విద్యార్థి భుక్యా రవీంద్ర నాయక్ కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి యం.దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ విభాగపు అధ్యక్షులు డా. నారాయణ మార్గదర్శకత్వంలో "బంజారా లోక్ గీతోం మే జీవన్ కే వివిద్ ఆయామ్" అనే అంశంపైన పరిశోధనా గ్రంథాన్ని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించినట్లు తెలిపారు. పరిశోధనా సమయంలో పలు జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని పత్రసమర్పణలు చేశారు. జాతీయ స్థాయిలో సాహిత్య అవార్డులు పొందారు. పలు హిందీ పరిశోధన యాత్రలు కూడా చేశారు. తమ జాతి బంజారా సంస్కృతి సంప్రదాయ యాల పాటల గొప్పదనం ఈ సమాజానికి తెలియాలని పరిశోధనలు చేశారు. భుక్యా రవీంద్ర నాయక్‌కు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు మరియు బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

'శ్రీచైతన్య'లో రక్తదాన శిబిరం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని లక్ష్మీపురం కూడలి వద్ద ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ బూర్సీ లక్ష్మీబాయి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎస్‌వీఐఎస్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కళాశాల ఏజీఎం బి.వి. ప్రసాద్, పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా రక్తదానం, అన్నదానం చాలా గొప్పవని, అన్నదానం ఆకలి తీర్చితే రక్తదానం ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఈ శిబిరంలో దాదాపు 90 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్, భాస్కర్, రామ్మోహన్, కేవల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి జగనన్న క్రీడా సంబరాలు

లోగో ఆవిష్కరించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్: సీఎం జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ "జగనన్న క్రీడా సంబరాలు" చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. తిరుపతి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తుమ్మలగుంటలో జగనన్న క్రీడా సంబరాలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ నెల 7వ తేదీ నుంచి చంద్రగిరి నియోజకవర్గ స్థాయి క్రీడలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ క్రీడలు నిర్వహించనున్నారు. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా జట్లు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఛీఫ్ కోచ్ ఉమా శంకర్ పేర్కొన్నారు. ఈ క్రీడల నిర్వహణ సమన్వయకర్తగా ఫిజికల్ డైరెక్టర్ బొంచు సుబ్రమణ్యం రెడ్డి వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ క్రీడల శిక్షకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: చిన్నతనంలో దేవస్థానం బడిలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం చంద్రగిరి దగ్గర ఉన్న పివిఆర్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలిశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన చిన్ననాటి మిత్రులతో పాల్గొని తమ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ అపూర్వ కలయిక కార్యక్రమానికి ఆర్గనైజింగ్ చేసిన మిత్రులను చంద్రగిరి ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రవి శంకర్ రెడ్డి, నిరంజన్ కుమార్ లక్ష్మీపతి వెంకట మునియాదవ్, రవికుమార్, చంద్రమౌళిరెడ్డి, బసవయ్య, శీను, సత్యకుమార్, స్వామి, తులసీరామ్ రాయల్, సెంథిల్ సత్యసాయి ప్రసాద్, శంకర్ నారాయణ, శివ ప్రసాద్, మోహన్, జ్యోతి ప్రకాష్, మురళీ, లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, మిగిలిన మిత్ర బృందంతో కలిసి కార్యక్రమానికి రాలేకపోయిన మిత్రుల సమాచారం సేకరించి కార్యక్రమానికి ఆహ్వానించారు.



ఘనంగా కార్తీక మాస మహోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి బాలాజీ కాలనీలోని బాస్ భవనంలో ఆదివారం తిరుపతి జిల్లాలోని తోట కుటుంబాల వారి కార్తీక వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లాలోని తోట కుటుంబాల వారు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక వన మహోత్సవ సంబరాలను ఆనందంగా వైభవంగా జరుపుకున్నారు. మొదట గణేశ పూజ నిర్వహించి ఉసిరి మొక్క తులసి మొక్కలకు పూజలు నిర్వహించి, దీపారాధనలు చేసి అర్చక స్వామిచే నైవేద్యం నివేదన చేసి అందరికీ కార్తీకదీపాలు వెలిగించి కార్యక్రమానికి శోభను తెచ్చారు. అదేవిధంగా ఈనెల 20వ తేదిన మంగళగిరిలోని హ్యాపీ రిసార్ట్స్‌లో జరిగే అఖిలభారత తోట వారి ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగే కార్తీక వన సమారాధన ఉత్సవానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో అందరూ పాల్గొనాలని కోఆర్డినేటర్లు తోట వీర మనోహర్ తోట జయంతి పేర్కొన్నారు.

బస్టాండు సరే.. వసతులేవీ..?

- రాత్రుల్లో కనిపించని వెలుతురు
- అవస్తలు పడుతున్న ప్రయాణికులు



రొచ్చుగా మారిన ఆర్టీసీ బస్టాండు



ఆర్టీసీ బస్టాండ్ లోకి రాని బస్సులు

ప్రజాశక్తి -బాలాయపల్లి : ప్రయాణికుల సౌకర్యార్థం బాలాయపల్లిలో ఆర్టీసీ బస్టాండు ఏర్పాటు చేసినా.. సరైన వసతులు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు విశాలంగా ఉన్నా అక్కడ బస్సులు ఆగే పరిస్థితి లేదు. మండలంలోని చుట్టుపక్కల ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కోసం ఇక్కడ వేచి ఉంటారు. బస్టాండు పరిస్థితి అధ్వానంగా మారింది. కూర్చునేందుకు కనీసం కుర్చీలు లేవు. రాత్రి అయితే వెలుతురు ఉండదు. చీకట్లోనే ప్రయాణికులు భయం భయంతో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. కుక్కలు, పందులకు నెలవుగా మారుతోంది. వర్షాలు పడితే ఇక్కడ పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. బాలాయపల్లి మీదుగా నిత్యం వందలాది బస్సులు ప్రయాణిస్తూ ఉంటాయి. కొన్ని సర్వీసులైతే గుంతల కారణంగా బస్టాండు లోపలకు రాకుండానే వెళ్తున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అన్నీ సమస్యలే..



చిన్నపాటి వర్షం వచ్చినా మోకాలు లోతు బురద వల్ల మండల కేంద్రానికి వచ్చే ప్రజలు బస్టాండ్‌లో బస్సు ఎక్కాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. - **మైలారి పెంచలయ్య (అయ్యోరు)బాలాయపల్లి**

సదాశివేశ్వర దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం



- ప్రమాణ స్వీకారం చేస్తున్న సదాశివ కోన దేవస్థానం పాలకమండలి


ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: సదాశివకోన కామాక్షి దేవి సమేత సదాశివేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారం మహోత్సవ వేడుకలు ఆదివారం పట్టణంలోని శివాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్.కె.రోజా మాట్లాడుతూ సదాశివకోనలో భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని.. కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి కషి చేయాలని కోరారు. అనంతరం సదాశివ కోన శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ సదాశివేశ్వరస్వామి దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ గా జయచంద్రన్, సభ్యులుగా ఉదయ్ కుమార్, వాసుదేవరెడ్డి, గోపి, రమణ, కమలమ్మ, లక్ష్మీ, వరలక్ష్మి, కోఆప్షన్ సభ్యులుగా అమరనాథస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పుత్తూరు మున్సిపాలిటీ ఛైర్మన్, హరి. వైస్ ఛైర్మన్లు జయప్రకాష్, శంకర్, కౌన్సిలర్లు, మండల ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపిటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, రాష్ట్ర డైరెక్టర్లు, ఆలయ కమిటీ ఛైర్మన్లు, పుత్తూరు శివాలయం కమిటీ ఛైర్మన్ రమేష్, దేవాదాయ శాఖ ఆలయాల ఇన్‌స్పెక్టర్ మునికష్ణయ్య, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొడుగుచింతకు ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రఖ్యాత నందమూరి తారక రామారావు శత జయంతి ప్రతిభా పురస్కారాన్ని పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత గొడుగుచింత గోవిందయ్య అందుకున్నారు. కృష్ణా నగర్ క్యాంప్, బళ్లారి లో జరిగిన కార్యక్రమంలో ఆదివారం ఈ అవార్డును గోవిందయ్యకు బహుకరించారు. గోవింద ఎక్కువ ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారం రావడం పట్ల ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

కాశీ విశ్వనాథ్‌కు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర పరిశోధక విద్యార్థి వై. కాశీ విశ్వనాథ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎం.దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య బివి.మురళీధర్ పర్యవేక్షణలో మార్గదర్శకత్వంలో "ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్ కులాల, తెగల రిజర్వేషన్లు అమలు అనంతపురం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖలో ఒక అధ్యయనం" అనే అంశంపై పరిశోధనా గ్రంధాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పరిశోధన వ్యాసాలను సమర్పించారు. వై.కాశీ విశ్వనాథ్‌కు డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు అధ్యాపకులు, ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సులు అమలు చేయాలి



ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడులోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం కేవీపీఎస్ సంఘం మండల మహాసభ వేణు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మృతిచెందిన సామాజిక కార్యకర్తలు ఉద్యమకారులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అరుణాచలం మాట్లాడుతూ 1998 అక్టోబర్ రెండో తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంఘం ఏర్పడినట్లు తెలిపారు. ఆనాటి నుంచి అనేక సామాజిక సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉందన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం, రాష్ట్రంలోని డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులతో పాటు పింఛన్లు, డప్పులు, దుస్తులు గజ్జలు, దళిత గిరిజనులకు స్మశాన స్థలం రెండు ఎకరాలు ప్రభుత్వాలు కేటాయించాలని పోరాడి విజయం సాధించిన ఘనత కేవీపీఎస్‌దేనని తెలిపారు.

నూతన మండల కమిటీ ఏర్పాటు

కేవీపీఎస్ గౌరవాధ్యక్షుడిగా రమేష్, అధ్యక్షుడిగా వేణు, ఉపాధ్యక్షులుగా దొరై, మాస్లామని, రాజేంద్రన్, సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా తేరువాయి శేఖర్, కార్యదర్శులుగా శ్రీనివాసులు, చిన్నిరాజ్, గోవిందస్వామి, అరుళ్, కోశాధికారిగా లోకేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వరదయ్యపాలెం కేవీపీఎస్ కార్యదర్శి గౌస్ బాషా, కేవీపీఎస్ కార్యకర్తలు, డప్పు కళాకారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి గంట వితరణ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి హైదరాబాదుకు చెందిన శ్రీకాంత్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం కిలో బరువున్న వెండి గంటను వితరణ చేశారు. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కేవీ సాగర్ బాబు ఆధ్వర్యంలో ఆ గంటను సమర్పించారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శనం చేయించారు.

ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం టిపిపియం ఉన్నత పాఠశాలలో ఎన్నుకున్నట్లు నూతన జిల్లా అధ్యక్షుడు రేగంటి దేవానంద్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా మండ్యం శివకుమార్, సహాధ్యక్షుడుగా యువకిశోర్, ఉపాధ్యక్షులుగా భారతి, రోహిణి, చెంగల్రాయులు, సతీష్, రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, అదనపు కార్యదర్శి సలీం, కోశాధికారి వెంకటయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సుదర్శన్ రెడ్డి, ప్రకాష్ రావు, చంద్రశేఖర్, అజ్మతుల్లా, మహిళా ప్రతినిధి రెడ్డిరాణి, కార్యవర్గ సభ్యులు మల్లీశ్వరయ్య, మహేష్, యాదగిరిరావు, వెంకటలక్ష్మి తదితరులను ఎన్నుకున్నామన్నారు. నూతన కార్యవర్గం సిపిఎస్ రద్దు కోసం పోరాడాలని అధ్యక్షుడు దేవానంద్ పిలుపునిచ్చారు.

వెంకటగిరి: వెంకటగిరి తెలుగుగంగ ప్రాజెక్టులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.డి.సలీంను జిల్లా అదనపు కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు పలువురు ఉద్యోగుల హర్షం వ్యక్తం చేశఉమ్మడి రాష్ట్రంలోనూ, ఎన్‌జిఒ నుండి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏర్పడిన నూతన సంఘంలో తన బాధ్యతలను నిర్వహించి పలు సమస్యలపై ఆయన పనిచేశారు. జిల్లా కార్యవర్గంలో చోటు దక్కడంతో సహచర ఉద్యోగులు ఆయనను అభినందించారు.

లక్ష్మమ్మ కండ్రిగలో 'మీకోసం-మీ తెలుగుదేశం'

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలంలోని లక్ష్మమ్మ కండ్రిగలో ఆదివారం నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి భానుప్రకాష్ ఆధ్వర్యంలో 'మీకోసం-మీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించారు. గ్రామస్థులు పూలతో స్వాగతం పలికారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి రాబోయే రోజుల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



బాలికలు స్వయం రక్షణపై అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ న్యాయవాది మురుగేశన్‌రెడ్డి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది మురుగేశన్‌రెడ్డి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: బాలికలు స్వయం రక్షణ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు సీనియర్ న్యాయవాది మురుగేశన్‌రెడ్డి అన్నారు. న్యాయ సేవా వారోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గహంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ఆత్మరక్షణ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని ఇంటి నుంచి పాఠశాలలు.. కళాశాలలకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రభుత్వం ఉచిత విద్యను అందిస్తోందని.. ప్రభుత్వం కల్పించే వసతులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బాల్య వివాహాలు చేసుకోరాదని సూచించారు. కార్యక్రమంలో వసతి గహ పరిరక్షణ అధికారిణి జయసుధ, పారా లీగల్ వాలంటరీ మహేష్ పాల్గొన్నారు.

ప్రజా సంకల్పం నెరవేర్చేది జగనన్నే: ఎమ్మెల్యే బియ్యపు



శ్రీకాళహస్తిలో..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రజల సంకల్పాన్ని నెరవేర్చే ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. అప్పటి ప్రతిపక్ష నేతగా వైయస్ జగన్మోహన్ రెడ్డి తలపెట్టిన ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం ఘనంగా సంబరాలు జరిపారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా కష్టాలు తెలుసు కోవడం కోసం జగనన్న ప్రారంభించిన ప్రజాసంకల్ప పాదయాత్ర నేటితో ఐదేళ్లు పూర్తి చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజాసంకల్ప యాత్ర సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు తలపెట్టినా జగనన్న వెనకడుగు వేయకుండా పాద యాత్రను పూర్తి చేశారన్నారు. ఇప్పుడు జనసేన, టీడీపీ, బీజేపీ, ఎల్లో మీడియా దుష్ట చతుష్టయంలా మారి జగన్‌పై కుట్రలు చేస్తున్నారని వాపోయారు. 2024 ఎన్నికలలో ఆ పార్టీలకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. అంజూరు తారక శ్రీనివాసులు, గుమ్మడి బాలకృష్ణ, పగడాల రాజు తదితరులు పాల్గొన్నారు.

బిఎన్‌కండ్రిగ: బీఎన్‌కండ్రిగలో ఆదివారం వైసీపీ కార్యాలయ ఆవరణలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వైసీపీ మండల కన్వీనర్ విద్యానాథరెడ్డి, నాయకులు గురునాథం మాట్లాడుతూ తెలుగుదేశం పాలనలో ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాటూరి ఎంపిటీసీ రవి, వైసీపీ నాయకులు గురవయ్య, భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంట ఎంపిపి హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యలంలో ఆదివారం పార్టీ కార్యాలయంలో వైసీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, వైస్ ఎంపిపి సుజాత, సర్పంచ్ నగేష్, కో ఆప్షన్ సభ్యులు సుభాన్ రాజా, నాయకులు యోగేశ్వర్ రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బిఎన్‌కండ్రిగలో..

కేసు పెట్టాడని కత్తితో హత్యాయత్నం



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: మిత్రులందరికీ జరిగిన చిన్నపాటి గొడవలో తనపై కేసు పెట్టాడని కక్షతో ఓ వ్యక్తి తన మిత్రులతో కలిసి మరో మిత్రుడుని కత్తితో పొడిచి హత్యాయత్నం చేసిన సంఘటన ఆదివారం తిరుపతిలో జరిగింది. పోలీసులు కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం మల్లంకుంట పంచాయతీలోని ఎస్‌టి కృష్ణారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న వెంకటేష్, విష్ణు సాయి, గోపి ముగ్గురు మిత్రులు. ఈ నెల 4వ తేదీ చిన్నపాటి గొడవ జరిగింది. అది చిలికి చిలికి గాలి వానై పెద్దదిగా మారింది. అదే రోజు వెంకటేష్, గోవి, విష్ణు సాయి తదితరులు తనపై దాడి చేశారని ఎంఆర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజులుగా కేసు రాజీబడేందుకు మిత్రులు ప్రయత్నించారు. కానీ వెంకటేష్ ససేమిరా అనడంతో శనివారం సాయంత్రం పోలీసులు గోపి విష్ణుసాయి తదితరులపై కేసు నమోదు చేశారు. దీంతో కక్ష పెంచుకున్న గోపి, విష్ణు సాయి, ఆదివారం ఉదయం వెంకటేష్ నివాసం వద్దకు వెళ్లి గొడవపెట్టుకున్నారు. ముందే అనుకున్న పథకం ప్రకారం తనపై కేసు పెట్టినందుకు గోపి, విష్ణు సాయిలు వెంకటేష్‌ను కత్తితో పొడిచారు. వెంకటేష్‌కు పేగులన్నీ బయటకు రావడంతో అక్కడే వదిలేసి పరారయ్యారు. స్థానికులు వెంకటేష్‌ను రుయా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వెంకటేష్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేష్ ను పరామర్శించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9న బాలోత్సవ్ నృత్య ప్రదర్శన



మాట్లాడుతున్న కొండా రవి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి మహతి కళాక్షేత్రం వేదికగా ఈ నెల 9, 10వ తేదీలలో శ్రీకృష్ణ నటరాజాలయం కూచిపూడి కళాక్షేత్రం వారి ఆధ్వర్యంలో తిరుపతి నృత్య బాలోత్సవ్- 2022 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కళాక్షేత్రం వ్యవస్థాపక కార్యదర్శి నాట్యాచార్య కొండా రవి తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో తిరుపతి నృత్యం బాలోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 1996 సంవత్సరంలో ఈ కూచిపూడి కళాక్షేత్రాన్ని తిరుపతిలో ప్రారంభించామన్నారు. నాటినుండి నేటి వరకు ఎంతోమంది భారతీయ సాంప్రదాయ కళా నృత్యాలను నేర్చుకుని నేడు దేశ విదేశాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారన్నారు. అంతేకాకుండా సినీ పరిశ్రమల్లో కూడా తమ కళాకారులు ఉన్నారని కొండా రవి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 300 నుండి 400 మంది పిల్లలు మహతి కళాక్షేత్రంలో నృత్య ప్రదర్శన చేస్తారని అన్నారు. కూచిపూడి, భరత నాట్యం, జానపద, పేరిణి, ఆంధ్రనాట్యం ఇలా సాంప్రదాయమైన నృత్యాలను పిల్లలు ప్రదర్శిస్తారన్నారు. రిజిస్ట్రేషన్ తదితర వివరాల కోసం 9849413592 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కొండ సాయినాథ్, సభ్యులు భానుకుమార్ ప్రసాద్ పాల్గొన్నారు.

వజ్రవేలురెడ్డి సేవలు చిరస్మరణీయం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఉపాధ్యాయులుగా.. అధ్యాపకులుగా.. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, డైట్ వైస్ ప్రిన్సిపల్‌గా వజ్రవేలురెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. ఆదివారం స్థానిక మెయిన్ స్కూల్‌లో వజ్రవేలురెడ్డి ప్రథమ వర్ధంతి వేడుకలను ఎస్టీయూ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షులు గంటా మోహన్ మాట్లాడుతూ వజ్రవేల్ రెడ్డి లాంటి నాయకులను కోల్పోవడం ఎస్టీయూ సంఘానికే కాకుండా ఉపాధ్యాయ వర్గానికి తీరనిలోటన్నారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. డైట్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ చెంగల్‌రాజు, ఎస్టీయూ చిత్తూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవరాజులరెడ్డి, మోహన్, రాష్ట్ర కౌన్సిలర్ కఠారి మోహన్ రెడ్డి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, డివిజనల్ కన్వీనర్లు యువరాజు, రమేష్, నాయకులు భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరాజు, సురేష్, వి.యం.రవి, గంటా మోహన్, వెంకటేశులు, కేశవులు, శివప్రసాద్, నాగేంద్రరాజు, రామచంద్రారెడ్డి, దేవరాజులు, ముత్యాలహరి, అమర్‌నాథ్‌రెడ్డి, వజ్రవేలురెడ్డి కుటుంబ సభ్యులు కమల్, కార్తీక్ తదితరులు పాలొన్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

ప్రజాశక్తి-రేణిగుంట శ్రీకాళహస్తి మార్గంలోని ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. రేణిగుంట మండలంలోని గుతువరపల్లికి చెందిన సాయి ఆదివారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెంకటగిరికి వెళ్తున్న బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. రేణిగుంట పట్టణ ఎస్ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - దొరవారిసత్రం : మండల పరిధిలోని అక్కరపాకు గ్రామ సమీపాన ఉన్న జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కరపాకు గ్రామానికి చెందిన చింతపూడి హేమాద్రి అను అతనికి గాయాలయ్యాయి. వివరాల మేరకు హేమాద్రి తన స్వగ్రామం అక్కరపాకు నుండి బైక్‌లో సూళ్లూరుపేటకు వెళ్లి తిరిగి తన స్వగ్రామానికి వస్తూ ఉండగా అక్కరపాకు గ్రామ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్దకు రాగ అదే వైపు నుండి వస్తున్న టిఎన్12ఏజె1253 నెంబర్ గల కారు బైకును వెనుక భాగం నుండి ఢీకొంది. దీంతో బైక్‌పై వస్తూ ఉన్న హేమాద్రి పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే బైక్‌ను ఢీకొన్న కారు అక్కడ ఆగకుండా తప్పించుకొని వెళ్లిపోయింది. అక్కడున్న గ్రామస్తులు కారు నెంబర్‌ను గుర్తించి కారు ఫోటో తీసి పోలీసులకు పంపారు. ఈ విషయంపై పోలీసులు విచారిస్తున్నట్లు తెలిపారు.